క్లుప్తంగా

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు

అంబాజీపేట: సంక్రాంతి సెలవులను పురస్కరించుకుని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తే వారిపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎంఈవో కె.వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఈ నెల 8 నుంచి 18వ తేదీ వరకు సంక్రాంతి సెలవులను ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఈ నెల 19 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం అవుతాయన్నారు.

శరవేగంగా పునర్నిర్మాణ పనులు



ఈదరాడలో నిర్మాణంలో ఉన్న గ్రామ దేవత పోళ్లమ్మ ఆలయం

మామిడికుదురు: ఈదరాడ గ్రామ దేవత పోళ్లమ్మ ఆలయ పునర్నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. శతాబ్దానికి పైగా చరిత్ర కలిగిన పోళ్లమ్మ ఆలయం జీర్ణోద్ధరణకు చేరుకుంది. దీంతో ఆలయాన్ని సమూలంగా తొలగించి దాని స్థానే నూతన ఆలయ నిర్మాణం చేపట్టారు. ప్రజా విరాళాలతో ఈ ఆలయం నిర్మిస్తున్నారు. ఆలయ నిర్మాణానికి సుమారుగా రూ.80 లక్షలు పైబడి వ్యయం అవుతుందని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ యెరుబండి శ్రీరామ్మూర్తి తెలిపారు. ఆలయ నిర్మాణం పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఫిబ్రవరి 20 నుంచి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు జరుగుతాయని చైర్మన్ శ్రీరామ్మూర్తి తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

ఆలమూరు: కొత్తూరు–వెదురుమూడి రోడ్డులోని పెదపళ్ల వద్ద లారీ ఢీకొని ఈతకోట శ్రీనివాసరావు (45) మృతి చెందాడు. ఆలమూరు ఎస్సై ఎల్.శ్రీను నాయక్ కథనం ప్రకారం రావులపాలెం మండలంలోని ఊబలంకకు చెందిన శ్రీనివాసరావు తన వ్యక్తిగత పని మీద అంగర వెళ్లి తన ఎలక్ట్రికల్ స్కూటర్‌పై తిరుగు ప్రయాణమయ్యాడు. స్థానిక జోడిచెట్లు వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొంది. ఈప్రమాదంలో శ్రీనివాసరావు తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈమేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అయోధ్య రాముని విగ్రహ ప్రతిష్ఠకు తరలిరండి

ఆలమూరు: భారతీయుల శతాబ్దాల కల నెరవేరనున్న ఈనెల 22న అయోధ్యలో జరిగే రామ మందిరం ప్రారంభోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు తరలి రావాలంటూ మండలంలోని చింతలూరులోని రామ భక్తులు మంగళవారం ఇంటింటికీ వెళ్లి ఆహ్వాన పత్రికలను అందజేసి అక్షతలను పంపిణీ చేశారు. అయోధ్యలో నిర్మితమై సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకున్న భవ్య రామాలయంలో బాల రాముని ప్రతిష్ఠ మహోత్సవాల వివరాలను తెలియజేశారు. కొత్తపేట నియోజకవర్గ ఆర్ఎస్ఎస్ అధ్యక్షుడు కృష్ణ శర్మ, ఏబీవీపీ రాష్ట్ర నాయకులు జి.అంజనీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థికసాయం



బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న మురళీకృష్ణ, శివకుమార్

మలికిపురం: అంతర్జాతీయ రోటరీ సంస్థ రోటరీ క్లబ్ మలికిపురం శాఖ సమకూర్చిన రూ.11 వేల ఆర్థికసాయాన్ని మండలంలోని శంకరగుప్తంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన ఇంజేటి వసంతరావు కుటుంబానికి అందించారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో నగదుతో పాటు వంట సామగ్రి, దుస్తులను అందించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు సోమిశెట్టి మురళీకృష్ణ, అసిస్టెంట్ గవర్నర్ నల్లి శివకుమార్, కార్యదర్శి బందెల సంపత్, స్థానిక సర్పంచ్ రాపాక ఆనంద్‌కుమార్, ఎంపీటీసీ మానుకొండ ప్రమీల, రోటరీ క్లబ్ ఫాస్ట్ ప్రెసిడెంట్స్ రాపాక విజయరావు, తోలేటి సతీష్, బడుగు మార్త జాయ్ పాపాజీ, డాక్టర్ ఎస్.రవి, మట్ట రవికుమార్ పాల్గొన్నారు.

ఈ–పంట నమోదు చేయించుకోవాలి

అంబాజీపేట: రబీ పంటకు సంబంధించి ప్రతి రైతు ఈ–పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి సీహెచ్‌డీ విజయ్ కుమార్ మంగళవారం తెలిపారు. మండలంలో ఇప్పటి వరకూ 30 ఎకరాల్లో ఈ–పంట నమోదు జరిగిందన్నారు. మిగిలిన రైతులు త్వరితగతిన నమోదు చేయించుకోవాలన్నారు. మండలంలో 3016 ఎకరాల్లో వరి సాగు చేపట్టారన్నారు. ఇప్పటి వరకు 50 ఎకరాల్లో మాత్రమే వరి నాట్లు పూర్తయ్యాయన్నారు. 15 నుంచి 20 రోజులు ఉన్న వరి నారుతో వరి నాట్లు వేయడం వల్ల వరి దుబ్బు బాగా చేసి అధిక దిగుబడులు ఇస్తుందన్నారు. రైతులు ఈ విషయాన్ని గమనించి నాట్లు వేసుకోవాలని సూచించారు.

ప్రశాంతంగా సంక్రాంతి ప్రభల ఉత్సవం

ఆర్డీవో ముక్కంటి, డీఎస్పీ రమణ



కొత్తపేట సంక్రాంతి ఉత్సవ కమిటీలు, శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో ముక్కంటి

కొత్తపేట: ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనే ఎక్కడా జరగని విధంగా, ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్న కొత్తపేట సంక్రాంతి ప్రభల ఉత్సవాన్ని కుల, మత, రాజకీయాలకు అతీతంగా, పోలీసులు, వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో ప్రశాంతంగా జరుపుకోవాలని కొత్తపేట ఆర్డీవో ఎం.ముక్కంటి, డీఎస్పీ కేవీ రమణ సూచించారు. రాష్ట్రంలో ముఖ్యంగా ఉభయగోదావరి జిల్లాల్లో ప్రభల ఉత్సవాలకు (కనుమ నాడు) భిన్నంగా కొత్తపేటలో అనాదిగా మకర సంక్రాంతి (పెద్ద పండగ) నాడు ప్రభల ఉత్సవాలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఆ మేరకు ఈ నెల 15న జరిగే సంక్రాంతి ప్రభల ఉత్సవాల నిర్వహణపై మంగళవారం స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఉత్సవ కమిటీలు, శాంతి కమిటీతో పోలీస్ అధికారులు సమీక్ష నిర్వహించారు. స్థానిక డీఎస్పీ కేవీ రమణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆర్డీవో ముక్కంటి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఉత్సవ కమిటీల తరఫున కొత్తరామాలయం ఉత్సవ కమిటీ ప్రెసిడెంట్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు మాట్లాడుతూ ఇక్కడ పాత, కొత్త రామాలయం, వీధుల పేరుతో ఉత్సవాలు జరుగుతాయని, 24 గంటల పాటు శ్రవణానందం, నయనానందకరంగా సాగే కార్యక్రమాలను వివరించారు. అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు మాట్లాడుతూ కుల, మత, వర్గాలకు అతీతంగా అందరూ తిలకించి, ఆనందించే ఈ ప్రభల ఉత్సవం అనాదిగా వివాదరహితంగా సాగుతుందన్నారు. పోలీసు వారు ఉత్సవానికి సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. డీఎస్పీ రమణ మాట్లాడుతూ ఇతర ప్రాంతాల్లో ప్రభల ఉత్సవాలకు భిన్నంగా కొత్తపేటలో భారీ స్థాయిలో జరిగే ప్రభల ఉత్సవానికి ప్రత్యేక స్థానం, గొప్ప పేరు ఉందన్న విషయం గత ఏడాది నుంచీ తనకు అవగాహన ఉందన్నారు. సంస్కృతి, సంప్రదాయాలను, అందరి మనోభావాలను గౌరవించాలని అన్నారు. బాణసంచా కాల్పుల సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మందుగుండు సామగ్రి తయారుచేసే కంపెనీలు, ఉత్సవ కమిటీలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కనుమ రోజున అవిడి డ్యామ్ సెంటర్, మందపల్లి, వానపల్లి గ్రామాల్లో జరిగే ప్రభల ఉత్సవాలపై కూడా సమీక్షించారు. అవసరమైన పోలీసు సిబ్బందిని పంపిస్తామని డీఎస్పీ హామీ ఇచ్చారు. సమావేశంలో సర్పంచ్ బూసి జయలక్ష్మి, రెడ్డి చంటి, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ ముసునూరి వెంకటేశ్వరరావు, పర్సన్ దంగేటి సుబ్రహ్మణ్యం, స్థానిక ఉప సర్పంచ్ కంఠంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీటీసీలు చావలి సుబ్బరాయశాస్త్రి, దూళి సూరిబాబు, వీడీసీ కన్వీనర్లు కుడుపూడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సంపూర్ణ ఆరోగ్యం



జొన్నాడలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్షలో వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు

ఆలమూరు: పేద ప్రజల ఆరోగ్య రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రెండో విడత చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా అందిస్తున్న అత్యుత్తమ సేవలతో ప్రతి ఒక్కరికి సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని కొత్తపేట అడిషనల్ డీఎంహెచ్ఓ ఎం.సుమలత అన్నారు. మండలంలోని జొన్నాడ–1 గ్రామ సచివాలయంలో పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సాయికిషోర్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ జగనన్న ఆరోగ్య సురక్షకు ప్రత్యేక వైద్య నిపుణులు మేఘ స్పందన (డీజీఓ), దుర్గా ప్రసాద్ (ఈఎన్‌టీ) పాల్గొని 173 మందికి మెరుగైన వైద్య సేవలు అందించి 106 రకాల మందులను ఉచితంగా అందజేశారు. వ్యాధి తీవ్రత అధికంగా ఉన్న పలువురిని గుర్తించి వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా రాజమహేంద్రవరం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సీహెచ్ఓ పి.రాధాకృష్ణ, హెచ్ఈ ఏవీవీ రాజా పర్యవేక్షణలో ఎంఎల్‌హెచ్‌పీలు సీజనల్ వ్యాధులు–లక్షణాలను వివరించారు. సర్పంచ్ కట్టా శ్రీనివాసు, ఉప సర్పంచ్ నాంద్ర నాగమోహన్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు తాడి మెహెర్ ఆదిత్యరెడ్డి, ఎంపీడీఓ కె.జాన్ లింకన్, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.ఉమ, గ్రామ కార్యదర్శి చిక్కాల వీరమాత తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు

అయినవిల్లి: సంక్రాంతి సందర్భంగా కోడి పందేల నిర్వహణకు ఎటువంటి అనుమతులు లేవని ఎస్సై కె.సురేష్‌బాబు అన్నారు. మంగళవారం సిరిపల్లి, చింతనలంక, రావిగుంటచెరువు తొత్తరమూడి, గ్రామాల్లో కోడిపందేలు నిర్వహించకుండా హెచ్చరిస్తూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. గతంలో కోడిపందేలు ఆడిన ప్రదేశాల్లోని యజమానులకు నోటీసులు ఇచ్చారు.

జగన్ పాలనలో అందరికీ సంక్షేమం



నర్శిపూడిలో మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి



మల్లయ్యదొడ్డిలో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

- ఎమ్మెల్యే జగ్గిరెడ్డి
- నర్శిపూడిలో రెండో రోజు గడప గడపకూ..

ఆలమూరు: పేదరిక నిర్మూలన, ప్రజా సంక్షేమంతో పాటు రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తూ పనిచేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు జనం నీరాజనం పడుతున్నారని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని నర్శిపూడిలో మంగళవారం పార్టీ నేతలు చల్లా వెంకట సుబ్రహ్మణ్యం, చల్లా పద్మ దంపతుల ఆధ్వర్యంలో రెండో రోజు నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ, భవిష్యత్‌లో చేపట్టబోయే కార్యక్రమాలను వివరిస్తూ ముందుకు సాగారు. సీఎం జగన్‌ను రాబోయే ఎన్నికల్లో మళ్లీ గెలుపించుకోవలసిన ఆవశ్యకత ఉందని ఉద్ఘాటించారు. పార్టీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, సర్పంచ్ కందిబొట్ల శ్రీనివాసు, ఎంపీటీసీ మేడిశెట్టి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్దుతున్నాం

రావులపాలెం: నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దడంతో పాటు ప్రజా సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి తెలిపారు. మండలంలోని కొమరాజులంకలో మంగళవారం పర్యటించి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. తొలుత రూ.కోటితో రుడా నిధులతో అభివృద్ధి చేస్తున్న వాకింగ్ ట్రాక్ పనులను పరిశీలించి పలు సూచనలు, సలహాలు అందజేశారు. అలాగే గ్రామ శివారు మల్లయ్యదొడ్డిలో రూ.15 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు, డ్రైనేజీకి ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

నేటి నుంచి మండల స్థాయి 'ఆడుదాం ఆంధ్రా'



కొత్తపేటలో కబడ్డీ పోటీలో తలపడుతున్న బాలికలు (ఫైల్)

కొత్తపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్రా' రెండో దశ మండల స్థాయి క్రీడా పోటీలు బుధవారం నుంచి జరగనున్నాయి. గ్రామ సచివాలయాల స్థాయిలో జరిగిన ఈ క్రీడా పోటీలకు కనీవినీ ఎరుగని రీతిలో విశేష స్పందన లభించింది. ఉప్పొంగిన ఉత్సాహంతో ఆడిన క్రీడాకారులు మండల స్థాయి పోటీలకు సమాయత్తమయ్యారు. క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడలకు సంబంధించి ఈ పోటీలు జరుగుతున్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు మండలాల్లోని 87 గ్రామ సచివాలయాల పరిధిలో గత నెల 26 నుంచి క్రీడా పోటీలు జరిగాయి. సచివాలయాల స్థాయిలో ఈ నెల నెల 6 వరకూ పోటీలు జరిగాయి. కొత్తపేట మండలంలో తొలుత మొత్తం 533 టీమ్‌లలో 2,467 మంది పురుషులు, 1,611 మంది మహిళలు పాల్గొన్నారు. క్రికెట్ వాడపాలెం సమీపాన నారాయణలంకలో, వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీలు స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లో, ఖోఖో స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాల గ్రౌండ్‌లో జరుగుతాయని పీడీ ఏఎస్ఎస్ రమాదేవి తెలిపారు. ఎంపీడీఓ ఈ.మహేశ్వరరావు, ఎంఈఓలు మట్టపర్తి హరిప్రసాద్, కె.లీలావతి పర్యవేక్షణలో ఎంఎస్‌డీఓ వైఎస్ఎస్ ఉషారాణి ఆధ్వర్యంలో ఈ క్రీడా పోటీలు జరుగుతాయని రమాదేవి తెలిపారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు సూచించారు. మామిడికుదురు ఎంపీపీ కార్యాలయంలో మంగళవారం ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి పోటీల నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, స్పోర్ట్స్ వలంటీర్లు, పీడీలతో సమీక్ష నిర్వహించారు. మండల స్థాయి పోటీల నిర్వహణకు మామిడికుదురు, లూటుకుర్రు, మొగలికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలల క్రీడా ప్రాంగణాలను ఎంపిక చేశామన్నారు. ఈ నెల 10 నుంచి 20వ తేదీ వరకు అయిదు విభాగాల్లో బాలుర, బాలికల విభాగాల్లో పోటీలు జరుగుతాయని చెప్పారు. గ్రామ స్థాయిలో జరిగిన పోటీల్లో 22 సచివాలయాల నుంచి బాలుర, బాలికల విభాగాల నుంచి మొత్తం పది జట్లు అర్హత సాధించాయన్నారు. మండల స్థాయిలో వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, క్రికెట్, ఖోఖో పోటీలు జరుగుతాయని చెప్పారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన వారిని నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికవుతారన్నారు. క్రీడాకారులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏఓ కె.వెంకటేశ్వరారావు, ఎంఈఓలు లక్ష్మీనారాయణ, మోకా వెంకన్నబాబు పాల్గొన్నారు.

డిజిటల్ ఫైనాన్షియల్ సర్వీసెస్‌పై సెమినార్



రాజోలు డిగ్రీ కళాశాలలో జరిగిన సెమినార్‌లో ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ శ్రీనివాస్

రాజోలు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఆర్థిక, వాణిజ్య శాస్త్ర విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో డిజిటల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఢిల్లీకి చెందిన జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ ప్రొఫెసర్ బత్తుల శ్రీనివాస్ ముఖ్యవక్తగా మాట్లాడారు. డిజిటల్ సర్వీసెస్ ఉపయోగాలు, వాటి ప్రాముఖ్యం గురించి వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పేద ప్రజలు ఏటీఎం, గూగుల్ పే, ఇంటర్నెట్ బ్యాంకింగ్‌లపై అవగాహన పెంచుకోవాలన్నారు. అలాగే వీటిని బాగా ఉపయోగించుకోవాలని విద్యార్థులకు ఆయన సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిబాబు, పద్మనాభం, డాక్టర్ చంద్రబోస్, గోపాలకృష్ణ, సరిత, నల్లి రాజు, భాస్కరరావు, శ్రీరామమూర్తి, రాజ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజోలు వాసికి డాక్టరేట్



కాపా వెంకటనారాయణ

మలికిపురం: దుండిగల్ (తెలంగాణ)లోని మర్రి లక్ష్మారెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న రాజోలు వాసి అయిన కాపా వెంకటనారాయణ డాక్టరేట్ సాధించారు. మధ్యప్రదేశ్ సహోరేలోని సత్యసాయి యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ అండ్ మెడికల్ సైన్సెస్ ఇటీవల ఆయనకు డాక్టరేట్‌ను ప్రకటించింది. 'కాంపరేటివ్ అనాలిసిస్ ఆఫ్ సైకాలజికల్ బిహేవియర్ ఆఫ్ తెలంగాణ సీనియర్ క్రికెట్ ప్లేయర్స్ బిఫోర్ అండ్ ఆఫ్టర్ కాంపిటీషన్' అనే విషయంపై పరిశోధన చేసి ఆ విశ్లేషణ పత్రం సమర్పించడంతో ఆయనకు డాక్టరేట్ పొందారు. ఈ ఫిబ్రవరి నెలలో జరగనున్న యూనివర్సిటీ స్నాతకోత్సవంలో సదరు యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేయనున్నట్లు వెంకటనారాయణ మంగళవారం తెలిపారు.

ఎన్నికల హామీలన్నీ అమలు చేసిన ఘనత జగన్‌దే



ప్రజా సంకల్ప యాత్ర కేకు కట్ చేస్తున్న పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి విప్పర్తి

పి.గన్నవరం: ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన ఘనత దేశంలో మన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్ర పూర్తి చేసి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక అక్విడెక్టు పార్కులో మంగళవారం ఆయన కేకు కట్ చేసి కార్యకర్తలకు పంచారు. రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి, నివాళులు అర్పించారు. విప్పర్తి మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్రలో ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చి అమలు చేశారని వివరించారు. పార్టీ రాష్ట్ర నాయకుడు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, సర్పంచ్ కొంబత్తుల ఏసుబాబు, సొసైటీ చైర్మన్ మెల్లం మహలక్ష్మి ప్రసాద్, ఎంపీటీసీ కొల్లే సూర్యనారాయణ, పార్టీ నాయకులు జల్లి శ్రీను, పుచ్చకాయల నర్సింహమూర్తి, పెచ్చెట్టి రాంబాబు, అడ్డగళ్ల శ్రీను, నాగాబత్తుల యవరాజు, కొక్కిరి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఏలో ఉత్తీర్ణత సాధించిన లక్కవరం విద్యార్థిని



సాయి లక్ష్మీబాయికి స్వీట్లు తినిపిస్తున్న తల్లిదండ్రులు మురళీమోహన్, గంగాభవాని

మలికిపురం: మండలంలోని లక్కవరం గ్రామానికి చెందిన విద్యార్థిని మంగెన సాయి లక్ష్మీబాయి ఇటీవల విడుదలైన చార్టెర్డ్ అకౌంటెంట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు. దేశ వ్యాప్తంగా ఈ ఏడాది సీఏ పరీక్షల్లో నూటికి 9.4 శాతం మాత్రమే ఉత్తీర్ణత సాధించగా ఇందులో సాయి లక్ష్మీబాయి ఒకరు కావడం గమనార్హం. ఈ సందర్భంగా స్థానిక కళాశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో సాయిలక్ష్మీని గ్రామస్తులు, అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో ఎంవీ సత్య ప్రసాద్, అకడమిక్ డైరెక్టర్ ఏబీ నాయుడు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.రాంబాబు, ఇంటర్ ప్రిన్సిపాల్ కె.నూకరాజు, విద్యార్థిని తల్లిదండ్రులు మంగెన మురళీమోహన్, గంగాభవాని పాల్గొన్నారు.

విద్యార్థులు బాధ్యతగా ఉండాలి

మలికిపురం: విద్యార్థులు బాధ్యతగా ఉండాలని రాజోలు సీఐ ఆర్.గోవిందరావు సూచించారు. మంగళవారం స్థానిక డిగ్రీ కళాశాలలో జరిగిన అవేర్‌నెస్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధానంగా లైసెన్స్‌తో కూడిన డ్రైవింగ్‌తో పాటు వ్యసనాలకు దూరంగా ఉండాన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టాల ప్రకారం చర్యలు ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో ఎస్సై బి.సంపత్ కుమార్, ఎంఈఓ విజయశ్రీ, ప్రిన్సిపాల్ తోరం సతీష్, విద్యార్థి సంఘ నాయకులు పోలిశెట్టి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగుల సంక్షేమ నూతన కార్యవర్గం



పి.గన్నవరంలో బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీటీ గోపాలకృష్ణ

పి.గన్నవరం: మండల బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్ష, గౌరవాధ్యక్షులుగా కట్టా రవికుమార్, డీటీ బి.గోపాలకృష్ణ ఎన్నికయ్యారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద మంగళవారం జరిగిన సమావేశంలో మండల కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కాపవరపు గోపాలకృష్ణ, ఆర్థిక కార్యదర్శిగా బిళ్ల దుర్గారావు, ఉపాధ్యక్షులుగా కొల్లాటి రవికుమార్, ముంగండ వీరబ్రహ్మం, విశ్వేశ్వరాయపు శివరామకృష్ణలు ఎన్నికయ్యారు. జిల్లా సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు గుబ్బల మురళీకృష్ణ, కారాడి వెంకట నరసింహారావుల పర్యవేక్షణలో ఎన్నికలు జరిగాయి. డీటీ గోపాలకృష్ణ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సంఘ నాయకులు కడలి శ్రీనివాస్, శివరామకృష్ణ, కట్టా శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో వికసిత్ భారత్

సఖినేటిపల్లి: పేదలకు కేంద్ర సంక్షేమ పథకాలు అందే లక్ష్యంగా ప్రధాని మోదీ వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని చేపట్టారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ మెంబర్ అడబాల సత్యనారాయణ, జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్ అన్నారు. మంగళవారం అంతర్వేదికర, అప్పనరామునిలంక గ్రామాల్లో అధికారులు వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాలు నిర్వహించారు. అంతర్వేదికరలో ఏపీవో నాగప్రసాద్, అప్పనరామునిలంకలో సర్పంచ్ ఇందుకూరి సుబ్బరాజు అధ్యక్షతన జరిగిన సమావేశాల్లో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వ్యవసాయంలో రైతులు ఆధునిక పద్ధతుల్లో డ్రోన్ల ద్వారా నేనో ఎరువులు పిచికారీ చేసే వీలును కేంద్రం కల్పిస్తోందన్నారు. ఈ మేరకు అప్పనరామునిలంకలో డ్రోన్ పనిచేసే విధానాన్ని వ్యవసాయ శాఖ రైతులకు వివరించింది. రాష్ట్ర కిసాన్ మోర్చా డ్రైనేజీ సెల్ కన్వీనర్ చెంపాటి శివరామకృష్ణంరాజు, నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు, మండల అధ్యక్షుడు పట్టపు సూర్యప్రకాశరావు, నాయకులు పాల్గొన్నారు.

అయినవిల్లిలో..

అయినవిల్లి: మండలంలోని వీరవల్లిపాలెం, మాగాం, తొత్తరమూడి గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. సర్పంచులు సలాది బుచ్చిరాజు, కాశి వీవీ సత్యనారాయణమూర్తి, వార జయసావిత్రిల అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేటుకూరి సూర్యనారాయణరాజు, బీజేపీ పి.గన్నవరం నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ చీకురుమిల్లి వెంకటేశ్వరరావు, సంకల్పయాత్ర ఇన్‌చార్జ్ గనిశెట్టి వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఆయుష్మాన్ భారత్ కార్డు ద్వారా పేదలకు రూ.5 లక్షల వరకూ వైద్యం చేయించుకోవచ్చన్నారు. అలాగే అనేక సంక్షేమ పథకాలను కేంద్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. మండల ప్రత్యేక అధికారి సత్యనారాయణ పాల్గొన్నారు.

గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు

పి.గన్నవరం: ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పి.గన్నవరం సీహెచ్‌సీలో 30 మంది గర్భిణులకు మంగళవారం ప్రత్యేక వైద్య సేవలు అందించారు. వేణి ఫౌండేషన్ చైర్మన్ నల్లా గంగా ఈశ్వరరావు ఆధ్వర్యంలో గర్భిణులకు, వారి సహాయకులకు పౌష్టికాహారం అందజేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ పి.కోటేశ్వరరావు, ఎంఈఓ వీరభద్రుడు, నల్లా పెదకాపు, రామకృష్ణ, కొర్లపాటి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని నాగుల్లంక పీహెచ్‌సీలో వైద్యాధికారులు వైవీ ప్రియాంక, రియాజ్ ఉన్నీసా బేగంల ఆధ్వర్యంలో మంగళవారం గర్భిణులకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. మొత్తం 42 మందికి వైద్యసేవలు అందించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ఉచిత వైద్య శిబిరం

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో మంగళవారం కుంపట్ల వెంకట్రావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గనిశెట్టి వెంకటేశ్వరరావు, నియోజకవర్గం అసెంబ్లీ కన్వీనర్ చీకురుమిల్లి వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పేద ప్రజలకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం అనేది వారి గొప్ప సహృదయమన్నారు.